

నేడు వాహనమిత్ర లబ్ధిదారులకు నగదు జమ



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో 11,819 మంది వాహనమిత్ర లబ్ధిదారులకు శుక్రవారం రూ.11,81,90,000 జమ చేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ నుంచి రాష్ట్ర సిఎం జగన్ బటన్ నొక్కి ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలోని 11,819 వాహనమిత్ర లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదును వారి ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. జిల్లాలో 21,953 ఆటో రిక్షాలు, 590 లగ్జరీ టూరిస్టు కాబ్‌లు, 670 మాక్సీ క్యాబ్స్, 270 మోబైల్ క్యాబ్స్, 2292 మోటారు క్యాబ్స్ గాను 11,819 మంది లబ్ధిదారులకు నగదు జమ జరుగుతుందన్నారు.

రసాయనాలతో రోగాలెన్నో..

- పెరుగుతున్న ఎరువుల వినియోగం
- విషతుల్యమౌతున్న వ్యవసాయ పంటలు
- ఆరోగ్యంపై పురుగు మందుల ప్రభావం



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రసాయన ఎరువులు అనేక రోగాలకు కారణమవుతున్నాయి. ఆహారమే తెలియకుండా ప్రాణాలను తోడేస్తోంది.. యేటా ఎన్ని కొత్త రసాయన ఎరువులు మార్కెట్లోకి వస్తున్నాయో.. అంతకు మించి కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయి. చాపకింది నీరులా కొత్త కొత్త వ్యాధులు వ్యాపిస్తున్నాయి. రోజురోజుకూ మార్కెట్లోకి వస్తున్న క్రిమిసంహారక మందులు ఆరోగ్యంపై ప్రమాదఘంటికలను మోగిస్తున్నాయి. ఇటీవల కాలం లో ఆర్గనో ఫాస్ఫరస్ పాయిజనింగ్, ఎప్లాస్టిక్ ఎనిమియా(బోన్ మారో ఫెయిల్యూర్ సిండ్రోమ్) వెలుగు చూడటానికి క్రిమిసంహారక మందులే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లుగా రకరకాల వైరస్‌లు, బ్యాక్టీరియాల కారణంగా జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్ కారక రోగాలు అనేకం నమోదు అవుతున్నట్లు వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్లాస్టిక్ ఎనిమియా వ్యాధికి వస్తే సాధారణంగా మందులు పిచికారి చేసే వ్యక్తుల్లో 60 శాతం మందిలో లక్షణాలు కనిపిస్తుండగా, పురుగు మందుల అవశేషాలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకున్న 30 శాతం మందిలో కనిపిస్తున్నట్లు వైద్యరంగ నిపుణుల అధ్యయనంలో తేలింది. ఎముకలోని మూలుగ మీద అత్యంత ప్రభావాన్ని చూపిస్తున్న క్రిమిసంహారక మందుల్లో ప్రధానమైనవి ఆర్గానో ఫాస్పేట్, కార్బోమేట్స్, ఆర్గానో క్లోరిన్, సింథటిక్ పైరిత్రాయిడ్స్ గ్రూపులకు సంబంధించిన క్రిమిసంహారక మందులు, పారాక్వాట్ డైక్లోరైడ్ లాంటి అత్యంత శక్తిమంతమైన రసాయనాలు మిశ్రమమైన క్రిమిసంహారక మందులను నేరుగా పీల్చినా, లేదా వాటి అవశేషాలు గల ఆహార ఉత్పత్తులను వాడినా ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఏటా 50 వేల మెట్రిక్ టన్నుల వినియోగం

జిల్లాలో ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో అన్ని రకాల పంటలు కలిపి సుమారు 5 లక్షల ఎకరాల్లో వరితోపాటు వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. సాగు నేపథ్యంలో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు, పురుగుల మందుల అవసరమని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. సాగు ప్రారంభ దశ నుంచి దశల వారీగా వినియోగం తప్పనిసరి అవుతోంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, సకాలంలో వర్షాలు పడకపోవటం, పంటలను చీడపీడలు ఆశించడం వంటి ప్రతికూల పరిస్థితుల వల్ల రైతులు పంటలను కాపాడుకునేందుకు ఎరువులు, పురుగుల మందులు విరివిగా వినియోగిస్తున్నారు. అయితే వాటి వల్ల ఎదురయ్యే నష్టాలపై అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం చొరవ లోపించింది.

పలు రకాల మందులపై నిషేధం

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్న పలు పురుగు మందులపై ఇప్పటికే నిషేధం ఉంది. కార్బరిల్ (సెవిన్) 15 ఏళ్లక్రితమే నిషేధించారు. అదేవిధంగా బోపాల్‌లో మిథేన్ గ్యాస్‌లీక్ దుర్ఘటన నేపథ్యంలో బిపిఎంసి (బిపవిన్) క్రిమిసంహారక మందులను నిషేధించింది. అదే విధంగా ఆర్గానో క్లోరిన్ గ్రూపునకు చెందిన ఒకప్పుడు చీమల మందుగా విని యోగించే (గమాక్సిన్) బెంగ్సిన్ హెక్సాక్లోరైడ్, ఎండ్రిన్గా పిలువబడే డైల్డోన్ డైకినైల్ ట్రైక్లోరో వాన్(డిడిటి) అత్యధిక విష పూరిత రసాయనాలు ఉండటం వల్ల ప్రభుత్వం నిషేధించింది.

ఆరోగ్యంపై పెనుప్రభావం

ఆరోగ్యవంతమైన వ్యక్తిలో హిమోగ్లోబిన్ 14 శాతం ఉండాలి. తెల్ల రక్తకణాల సంఖ్య 1.50 లక్షల నుంచి 4 లక్షల దాకా ఉండాలి. కానీ ఎప్లాస్టిక్ ఎనిమియా పడితే హిమోగ్లోబిన్ రెండు శాతానికి, తెల్లరక్త కణాల సంఖ్య కనిష్టంగా 3000 నుంచి 1000 వరకు పడిపోతోంది. క్రిమిసంహారక మందుల్లో ప్రమాదకర ఆర్గానో ఫాస్పేట్ వల్ల కళ్లు, కాలేయం, జీర్ణకోశం, ఎముకల్లోని మూలుగు, చర్మంపై దుష్ప్రభావం చూపిస్తాయి. గర్భిణీలు పురుగుమందుల అవశేషాలు కలిగిన ఆహార దార్థాలను తీసుకుంటే పిండం ఎదుగుదల నిలిచిపోతుంది. శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు తెల్ల, ఎర్ర రక్త కణాలు(ప్లేట్ లెట్స్) కీలకంగా దోహదపడుతుంటాయి. ఎముక కల్లోని మూలుగ (స్టెమ్ సెల్స్)పై దాడి చేసి తెల్ల, ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి విఘాతం కలిగిస్తాయి. దీంతో ఈ రక్తమైన ఇబ్బంది దులకు గురయ్యే వ్యక్తులు రక్తహీనతకు అధిగ మించేందుకు నిత్యం రక్తం, ప్లేట్‌లెట్స్‌ను ఎక్కించుకోవాల్సి ఉం టుంది. ఎప్లాస్టిక్ ఎనిమియా సోకిన వ్యక్తుల చిగుళ్ల నుంచి రక్తం కారుతుంది. శరీరంలో తెల్లరక్తకణాల సంఖ్య తగ్గేకొద్దీ తీవ్రంగా జ్వరం వస్తుంది. ముక్కు లేదా నోటి నుంచి రక్తం వస్తుంది. క్రమేణా బలహీనత ఆవహించి మనిషి ఎటూ కదలలేని పరిస్థితికి చేరుకుంటారని వైద్యులు చెబుతున్నారు.

మందుల వినియోగంపై అవగాహన తప్పనిసరి

ఎరువులు, పురుగుల మందుల వినియోగం తప్పనిసరి. పంటచేలపై చీడపీడల నివారణ కోసం రైతులు పిచికారి చేసే ప్రమాదకర హైటాక్సిక్ కేటగిరీ రసాయనిక పురుగు మందులను ఇప్పటికే భారత ప్రభుత్వం నిషేధించింది. మండల వ్యవసాయ కార్యాలయాలలో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పంటలపై పిచికారి చేసే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పనిసరిగా మాస్కులు, గ్లౌస్‌లు ధరించాలి.

ఎస్. మాధవరావు వ్యవసాయాధికారి, తూర్పు గోదావరి జిల్లా



వీడియో కాన్ఫెరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి తేజ్ భరత్

సవరించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


జెఎఎస్, రీ సర్వే ఫేజ్ -3 , హౌసింగ్‌లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సవరించిన లక్ష్యాలకు అనుగుణంగా స్టేజ్ కన్వర్షన్‌పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందని జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌లతో రెవెన్యూ రీ సర్వే, జాతీయ రహదారులు, వ్యవసాయం, డైరీ అభివృద్ధి, చిరు ధాన్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, పిఆర్‌లో ప్రాధాన్యత భవనాలు, ఉపాధిహామీ, స్వమిత్వ, జేకేసిలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జెసితోపాటు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో భూముల రీ సర్వేకి చెందిన ఫేజ్ -2లో 54 గ్రామాల్లో ఫైనల్ ఆర్ఒఆర్, కరెక్షన్ మాడ్యుల్ పూర్తి చేసినట్లు జెసి వివరించారు. సరిహద్దు రాళ్ళు ఏర్పాటుకి చెందిన 53,552 లక్ష్యాలను వంద శాతం సాధించడం జరిగిందన్నారు. ఫేజ్ -2కు చెందిన 22 (ఏ) లేయార్ మాడ్యుల్ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ఫేజ్ -3కి చెంది 90 గ్రామాల్లో రీ సర్వే పనులకు గానూ గత 15 రోజులకు చెందిన 10 గ్రామాలకు చెందిన లక్ష్యాలకు గాను 13 గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. వ్యవసాయ రంగంకు సంబంధించి ఈ కేవైసికి చెందిన పంటల, రైతుల వివరాలకు జాబితా ప్రకటన మార్గదర్శకాల ప్రకారం సెప్టెంబర్ 30 నాటికి పంట నమోదు పూర్తి చేసి సామాజిక తనిఖీ కోసం ఆర్‌బికెల వద్ద అక్టోబర్ 5 నుంచి 10 వరకు ప్రదర్శిస్తామని తెలిపారు. మల్టీ పర్పస్ గోడౌన్ నిర్మాణాలకు సంబంధించి మొత్తం 77 భవనాలకు గాను 56 చోట్ల స్థలాలు గుర్తించి అందించామని,గత వారంలో 4 చోట్ల స్థలాలు గుర్తించినట్లు వివరించారు. హౌసింగ్‌కి చెంది మార్పు చేసిన లక్ష్యాల మేరకు 19,253 ఇళ్ళ నిర్మాణాలు కు గాను స్టేజ్ కన్వర్షన్‌లో 14,372 ఉన్నాయని, బేస్మెంట్ స్థాయికి ముందు 36,767 ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఎస్ఈ ఎస్‌బివి ప్రసాద్, సిపిఓ ఏ. ముఖ లింగం, వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, డ్వామా పిడి పి. జగదాంబ, పిడి డిఆర్‌డిఎ ఎస్. సుభాషిణి, హౌసింగ్ అధికారి జి. పరశురాం, డిపిఒ జేవి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జీవకారుణ్య సంఘానికి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అందజేత

ప్రజాశక్తి- రాజమ్‌హేంద్రదవరం

జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)ను స్థాపించి 67సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా ఆ సంస్థ సీనియర్ డివిషనల్ మేనేజర్ బి.ప్రసాదు రావు, మార్కెటింగ్ మేనేజర్ బి.వి.కళ్యాణ్, సేల్స్ మేనేజర్ బి.శ్రీనివాసరావు చేతుల మీదుగా గౌతమీ జీవ కారుణ్య సంఘం ఛైర్మన్ బర్రె కొండబాబు, ఎసి విజయ లక్ష్మిలకు ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ డివిషనల్ మేనేజర్ ప్రసాదరావు మాట్లాడుతూ వృద్ధులకు, చిన్న పిల్లల శ్వాస సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందన్నారు. జీవ కారుణ్య సంఘంలో వృద్ధులు అధికంగా ఉన్నందున వీరికి ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అలాగే ఇటీవల ఎస్‌సి బాలికల వసతి గహానికి అవసరమైన ఫర్నేచర్‌ను అందించినట్లు వివరించారు. కాన్సన్ట్రేటర్‌ను అందించిన ఎల్ఐసి సంస్థ యాజమాన్యం ప్రతినిధులకు ఛైర్మన్ కొండబాబు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.గన్నయ్య, ఎకె.విశ్వనాథ్, పి.ఆనంద్ కుమార్, టి.బాబు రాజేంద్ర ప్రసాద్, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందచేత



బీమా సొమ్మును అందిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ముక్కామల గ్రామానికి చెందిన వేండ్ర శ్రీహరి (42) ఇటీవల గుండెపోటుతో మతి చెందారు. వైఎస్ఆర్ బీమా పథకంలో మట్టి ఖర్చుల నిమిత్తం మతుడు భార్య లక్ష్మికి రూ.10 వేలను సర్పంచ్ కేతా త్రిమూర్తులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెండ్ర శ్రీనివాస్, నాయకులు వేండ్ర యేసు, వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ అహ్మద్ అలీషా, వాలంటీర్ వేండ్ర గంగావతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చాగల్లు విద్యార్థులు

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం పి.వీర్రాజు తెలిపారు. ఏలూరు కెపిడిటి స్కూల్లో మంగళవారం జరిగిన పోటీల్లో జి జాహ్నీ, హిమబిందు, కె జ్ఞానేశ్వరి నవ్య, రోహిణి రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎంపిక య్యారని చెప్పారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన జె. విజయకుమారితోపాటు, పాఠశాల పేరును రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లిన విద్యార్థులను హెచ్ఎంతోపాటు, ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ ఛైర్మన్ ముద్రగడ భగవాన్, సభ్యులు అభినందించారు.

జాషువాకు ఘన నివాళి



జాషువా చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత గుఱ్ఱం జాషువా జయంతి కార్యక్రమాలు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **రాజమహేంద్రవరం** గుర్రం జాషువా 128 జయంతి సందర్భంగా గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద జాషువా చిత్రపటానికి ఎంపి మార్గాని భరత్, వైసిపి సిటి కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనవాస్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు పాల్గొని మాట్లాడారు. **కడియం** స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో గుఱ్ఱం జాషువా జయంతిని పాఠశాల తెలుగు విభాగం అధ్యక్షులు గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు గిరిజాల బాబు, కవి డాక్టర్ నీలకంఠరావు పాల్గొన్నారు. అలాగే వేమగిరి బుద్ధవిహార్‌లో యార్లగడ్డ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ వి.లజపతి రాయ్ పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** స్థానిక ఎల్ఐసి సెంటర్లో దళిత నాయకులు పెనుమాక జయ రాజు ఆధ్వర్యంలో జాషువా విగ్రహనికి. పూల మాలలు వేసి 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కొనసాగుతున్న టిడిపి రిలే నిరహార దీక్షలు



రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జరుగుతున్న రిలే నిరహారదీక్షలు గురువారం కొనసాగాయి. పలు ప్రాంతాల్లో జరిగిన నిరసన కారక్రమాల్లో పలువురు ముఖ్య నేతలు పాల్గొని చంద్రబాబు తెలుగు జాతి ఆస్తి అని, ఆయనను కాపాడుకో వాల్సిన బాధ్యత తెలుగు ప్రజలం దరిపైనా ఉందని పిలుపునిచ్చారు. **రాజమహేంద్రవరం** కోరుకొండ రోడ్డులో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. గీత కార్మికులు మోకులతో దీక్ష చేపట్టారు. అనంతరం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. **దేవరపల్లి** మండలంలోని యర్నగూడెం బస్‌స్టాండ్ టిడిపి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దే వెంకట రామారావు, ఆంద్రు అనిల్, జనసేన నాయ కులు కాట్నం గణేష్ తదితరులు సంఘీభావం తెలిపారు. **పెరవలి** మండలంలోని కొత్తపల్లి అగ్రహారం, నల్లాకుల వారిపాలెం గ్రామాల్లో రిలే నిరాహారదీక్షలు జరిగాయి. కొత్తపల్లి అగ్రహారం వద్ద మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, ముక్కామల సెంటర్ వద్ద టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ దీక్షల్లో పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి - కడియం



సమావేశంలో మాట్లాడుతున్న తాడాల

వైసిపి కార్యకర్తలకు వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని మండల జెసిఎస్ కన్వీనర్ తాడాల విష్ణు చక్రవర్తి అన్నారు. కన్వీనర్స్, గృహ సారథులు, వాలంటీర్లకు ఇన్సూరెన్స్ చేసే కార్యక్రమాన్ని గురువారం కడియపులంకలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి కార్యకర్తల కుటుంబాలకు భరోసా ఇచ్చేందుకు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి చందన నాగేశ్వర్ విజయవానికి శక్తి వంచన లేకుండా పాడుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడియపులంక కోపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, నాయకులు బోడపాటి సత్యనారాయణ, సింగంశెట్టి శ్రీను, బోడపాటి మూర్తి, చీకట్ల మాచరయ్య, అడ్డగల్లు రమేష్ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను సద్వినయోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అసంఘిత రంగ కార్మికులకు త్వరలోనే శిక్షణా తరగతులను నిర్వహించనున్నామని, వాటిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూషకుమారి సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో గురువారం అసంఘిటిత కార్మికులకు న్యాయ విజ్ఞన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూషకుమారి మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంఘం సంయుక్తంగా నైపుణ్యాభివృద్ధి తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచడం ఈ శిక్షణా కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 15 మంది కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం. లలిత కుమారి, పలు రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

41 సిఆర్‌పిసిని రద్దు చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న కెవిపిఎస్ నేత జువ్వల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


ఎస్‌సి, ఎస్‌టి సామాజికవర్గాలకు రక్షణ కవచంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి చట్టాన్ని నీరుగార్చే 41 సిఆర్‌పిసిని తక్షణమే రద్దు చేయాలని ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాలు, దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. నగరంలోని గోకవరం బస్‌స్టాండ్ వద్ద డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద తూర్పు గోదావరి జిల్లా ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాలు, దళిత సంఘాల నాయకులు చేపట్టిన మహాధర్నాలో 'చార్టర్ ఆఫ్ డిమాండ్స్' దళిత ఎజెండాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులసంఘం నాయకులు ఎల్‌వి ప్రసాద్ రావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే 41 సిఆర్‌పిసి రద్దు చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బద్దే జార్జి ఆంటోనీ మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దువ్వాడ రాజా మాట్లాడుతూ కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులను అమలు చేయాలని అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించాలని, మిగులు భూములు దళితులకు పంచాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాచే విధానాలను విరమించేనేలా ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాలు, దళిత సంఘాలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ఉద్యమంలో కెవిపిఎస్ అగ్రభాగాన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. యేసురత్నం, పి నిర్మల పి ప్రశాంతి, పి ఆనంద్, ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ యూనిట్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు గురువారం కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం వేలివెన్నులో జరిగిన వినాయకుడి నిమజ్జనం కార్యక్రమంలో ఎంపి మార్గాని భరత్‌తో కలిపి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, జడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కర రామయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నాసిరకం మద్యంతో మరణాలు

ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న వైసిపి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్ల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వివిధ కుంభకోణాల ద్వారా ప్రజాధనాన్ని వైసిపి ప్రభుత్వం లూటీ చేస్తుందని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. స్థానికంగా ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న జగన్ రెడ్డి ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులకు పాల్పడుతుందని మండిపడ్డారు. గత నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం చేయకపోగా తప్పులను ఎత్తిచూపుతున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ ఓటు వేసి ప్రజలపైనే కక్షసాధింపు చర్యలకు దిగుతున్నాడని విమర్శించారు. నిత్యం ప్రజల కోసం పరితపించే చంద్రబాబును జైల్లో పెట్టి మానసికంగా హింసకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని, రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుందని ఆరోపించారు. ప్రజలను చైతన్యవంతులు చేస్తున్న చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లను చూసి వైసిపి ప్రభుత్వం భయపడి కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. స్కిల్ డెవలప్ మెంట్‌లో అవినీతి జరిగితే రెండు లక్షల మంది నిరుద్యోగులు ఉపాధిని ఎలా పొందారని ప్రశ్నించారు.రాజకీయ కుట్రతో తప్పుడు ఆరోపణలు చేసి చంద్రబాబుపై అక్రమ కేసులు మోపడం ఎంత వరకు సమంజసమో రాష్ట్ర ప్రజలు ఆలోచించాలని అన్నారు. ఈ ఫాసిస్టు పాలనను చూసి కార్యకర్తలు భయపడాల్సిన పనిలేదని, రాబోయే ఎన్నికల్లో టిడిపి అఖండ మెజారిటీతో గెలిసి అధికారంలోకి రానున్నదని భరోసా ఇచ్చారు.

శాంతిభద్రతలపై దృష్టి సారించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - గోకవరం

మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని జిల్లా ఎస్‌పి పి.జగదీష్ ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ సిబ్బంది పని తీరుపై ఆరా తీసిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో నేరాలను అరికట్టే దిశగా ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగానే జిల్లాలో ఆయా పోలీస్‌స్టేషన్ల పనితీరును పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలను చేపడుతున్నట్లు వివరించారు. శాంతి భద్రతలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించేందుకు సిసి కెమెరాల సంఖ్యను పెంచాల్సివుందన్నారు. ఏజెన్సీ ముఖద్వారమైన గోకవరం కేంద్రంలో మాదక ద్రవ్యాలు, నాటుసారా, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించినట్లు వివరించారు. రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్, తెలగపాముల కదలికలపై సిసి కెమోరాల ద్వారా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ పర్యటనలో కోరుకొండ సిఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ శివ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబర్ 2న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - తాళ్లపూడి

పలు సేవా సంస్థల ఆధ్వర్యంలో అక్టోబర్ 2న తాళ్లపూడిలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు సింహాద్రి జనార్దన్ రావు, ఎఎస్ఓ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి గోడపత్రికను గురువారం ఆవిష్కరించారు. రక్తదానం ద్వారా ప్రాణదానం చేయవచ్చునని, పెద్ద సంఖ్యలో రక్తదాతలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనహిత ప్రతినిధి మాణిక్యం, నందన ఫౌండేషన్ ప్రతినిధి దేవరపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

100 శాతం రుణాల వసూళ్లు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తాడిపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఈ ఆర్థిక సంవత్సరంలో 100 శాతం రుణాలను వసూళ్లు చేసిందని సంఘ ఛైర్మన్ అక్కిన రామకష్ణ తెలిపారు. గురువారం సొసైటీ భవనంలో నిర్వహించిన మహాజన సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. 2022-23 సంవత్సరానికి ఆడిట్ రిపోర్ట్ ప్రకారం స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు రూ.10 కోట్లు ఉండగా, ఎరువుల వ్యాపారం ద్వారా రూ.2 కోట్లు చేయగా, నికర లాభం రూ.9.77 లక్షలు వచ్చిందని తెలిపారు. 100 శాతం రుణాలను వసూలు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, తాడిపర్రు, వెలగదుర్రు గ్రామ రైతులు, సిఇఒ కరుటూరి సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఇబి శేరు సూకరాజు తెలిపారు. స్థానిక దరియాలతిప్ప ఫ్లడ్ బ్యాంక్ రోడ్లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఆటోలో తరలిస్తున్న 384 బీరు బాటిళ్లను పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.43 వేల ఉంటుందన్నారు. పట్టుకున్న మద్యాన్ని రెవెన్యూ శాఖకు అప్పగించామన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్ఇబి అధికారులు ఏలేరు రిజర్వాయర్ ప్రాంతాల్లో గురువారం ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఎస్ఇబి సిఐ పి.అశోక్ తెలిపిన వివరాల మేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలేరు పరివాహక ప్రాంతాల్లో ప్రత్యేక దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో సారా తయారీకి నిల్వ ఉంచిన బెల్లపు ఊట ధ్వంసం చేయడంతో పాటు 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం పేరవరంలో పరివర్తన 2.0 పేరుతో అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ బి.శ్రీనివాస రావు, సిబ్బంది వెంకన్నదొర, కృష్ణార్జునబాబు, ఎం.వెంకటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం జి మేడ పాడు-పెదబ్రహ్మదేవం మధ్యలో విజయవాడ కు వెళ్లే అప్ లైన్ ట్రాక్ పై గుర్తు తెలియని రైలు కింద పడ తిమ్మాపురం వాసి పెదపూడి నాగ గంగా సత్య శ్రీనివాస్ (36) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సామర్లకోట రైల్వే పోలీసుల సమాచారం ప్రకారం శ్రీనివాస్ ఈ ఉదయం ప్రాంతం లో గుర్తు తెలియని రైలు కింద తల తలపెట్టి ఆత్మ హత్య కు పాల్పడ్డాడన్నారు. అయితే ఆత్మహత్య కు గల కార ణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి జిఆర్పి ఎస్ఐ బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు రైతు కూలి మృతి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

పాముకాటుకు గురై వ్యవసాయ కూలి మృతి చెందిన సంఘటన తిరుమాలి గ్రామంలో తీవ్ర విషాదానికి గురి చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశాల రాంబాబు (48) తిరుమాలి గ్రామంలో వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. యథావిధిగా గురువారం మధ్యాహ్నం పొలం పనికి వెళ్లిన రాంబాబును పాము కాటేసింది. దీంతో స్థానికులు ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య దేవి, కుమారులు నూకరాజు, సత్తిబాబు ఉన్నారు.



బురద సమస్యపై ఆందోళన తెలుపుతున్న ప్రజలు

బురద సమస్య పట్టదా?

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ 31వ వార్డులో నివాసాల మధ్య రహదారి బురదమయంగా మారి అత్యంత దారుణంగా ఉండడంపై ఆ వార్డు ప్రజలు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా తమ నివాసాల మధ్య బురద వీడకుండా ఉండడంతో ఇంటి నుంచి కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగేందుకు నీళ్లు పట్టుకునే కుళాయి సైతం బురదలో చిక్కుకుని ఉందని తెలిపారు. గత రాత్రి కురిసిన భారీ వర్షానికి పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. ఇళ్లలోకి విషపురుగులు వచ్చి చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. దోమలు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో ప్రజల నుంచి నేడు 'జగనన్నకు చెబుదాం' అర్జీలను స్వీకరిస్తామని కమిషనర్ కె. దినేష్ కుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. అర్బన్కు సంబంధించి జెకెసి కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, నగర ప్రజలు అధికారులను నేరుగా కలిసి తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియ చేయవచ్చునని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతాదని తెలిపారు.



కవి నేలపూరి రత్నాజీని సత్కరిస్తున్న దృశ్యం

జాతీయ అవార్డు గ్రహీత 'నేలపూరి'కి సత్కారం

ప్రజాశక్తి - చాగల్లు

జాతీయ అవా ర్డును అందుకున్న చాగల్లు గ్రామానికి చెందిన కవి నేల పూరి రత్నాజీని ఘనంగా సత్కరించారు. కృష్ణా జిల్లా కంచికర్లలో గుర్రం జషువా 128 వ జన్మదినం పురష్క రించుకుని ఆయనను దుశ్శాలువాతో ఘనంగా గురువారం సత్కరించారు.. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

'చలో విజయవాడ' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చేపట్టనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య భవన్లో ఈ మేరకు ముద్రించిన పోస్టర్ను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగం మొత్తం కార్పొరేట్, ప్రయివేటు పరమవుతుందన్నారు. ఈ విధానాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా అమలుకాని నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. తరగతులు ప్రారంభించి నాలుగు నెలలైనా నేటికీ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయలేదన్నారు. హానర్స్ డిగ్రీ విధానం కారణంగా అడ్మిషన్లు పూర్తికాలేదన్నారు. ఆన్లైన్ అడ్మిషన్ ప్రక్రియ ఆపాలని, హానర్స్ డిగ్రీ రద్దు చేయాలని, జిఒ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. కాకినాడ జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వాసు, సాహిత్య, ఆదర్శ కార్తిక్, పవన్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



మాట్లాడుతున్న శాంతకుమార్

లాయర్లకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి -కాకినాడ

లాయర్లకు రక్షణ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ తెలిపింది. గురువారం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్లో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐలు) సమావేశం సీనియర్ న్యాయవాది కుంచే శ్రీహరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఐలు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం, ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలు కోల్పోయిన హక్కుల కోసం పోరాడడం ఐలు లక్ష్యమన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టుల్లో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలకు సమాన ప్రాతినిధ్యాలను కల్పించాలన్నారు. ఎజిపి, పిపి పోస్టులకు ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలను ఎంపిక చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి నాగాబత్తుల రాంబాబు ఆహ్వానం పలకగా రాష్ట్ర ఐల నాయకుడు గుంటి సురేష్ బాబు, ఉభయ గోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్ యు.విష్ణుకుమార్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కోట రామ్మోహన్రావు, పినిపే రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కన్వీనర్గా నాగాబత్తుల రాజబాబు, కో-కన్వీనర్గా వడ్డి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సామర్లకోటలో కుండపోత

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

అల్పపీడన ప్రభావంతో సామర్లకోట పట్టణంలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రి వరకూ 68 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం బీభత్సాన్ని సృష్టించింది. పట్టణమంతా చెరువయ్యింది. ఎక్కడ చూసినా ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లు, ఆర్టిసి బస్టాండ్, రైల్వేస్టేషన్ ఆవరణ అన్ని ప్రాంతాలు వర్షపునీటితో నిండిపోయాయి. గంటకు పైగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి పట్టణంలో జనజీవనం స్తంభించింది. డ్రెయినేజీలు పొంగడంతో మురుగునీరు రోడ్లపైకి చేరింది. రైల్వే స్టేషన్ ఎదురుగా, కెనాల్ రోడ్డుపై ఐదు తూముల వద్ద, కాకినాడ రోడ్ లోని పలు ప్రాంతాల్లోనూ వర్షపు జలాలు రోడ్లపై ప్రవహించాయి. వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టిసి బస్టాండ్ పూర్తిగా నీటమునగడంతో ప్రయాణికుతు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రేబిస్ టీకాలు వేయించాలి

కాకినాడరూరల్ : పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేయించాలని పశు వైద్యులు డాక్టర్ తలాటం సురేష్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కుక్క, పిల్లి, గబ్బిలం వంటి వాటికి వైరస్ ఉంటే అవి కరిస్తే మనుషులకూ రేబిస్ వస్తుందన్నారు. కుక్క కరిచిన వెంటనే సబ్బు నీటితో శుభ్రం చేయాలని అనంతరం ఇంజక్షన్లు చేయించుకోవాలని సూచించారు. రేబిస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 60 వేల మంది మరణిస్తున్నారన్నారు. ప్రాణాంతక వ్యాధి అయినందున దీన్ని నియంత్రించడానికి 2007 నుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ 28న ప్రపంచ రాబిస్ నివారణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని సురేష్ తెలిపారు. అనంతరం జాతీయస్థాయిలో ఉత్తమ సర్జన్ పురస్కార గ్రహీత అయిన డాక్టర్ సురేష్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, యనమల రామం, ఎస్. శ్రీ నగేష్, మీనాక్షి, సుబ్బారావు, శిరీష పాల్గొన్నారు.

ముస్లిముల ప్రత్యేక ప్రార్ధనలు

పెద్దాపురం : మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక జామియా మసీదు ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ ప్రార్ధనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, అంజుమన్ ప్రెసిడెంట్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్, షేక్ గౌస్ రఫీ, బాబూలాల్, దొరబాబు, ఎపి అగ్రో డైరెక్టర్ కరీం జానీ పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానాలు

పెద్దాపురం : గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా పెద్దాపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో,పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో గురువారం అన్నదానాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు, చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహలక్ష్మి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇనుకొండ విష్ణు చక్రం, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రౌతులపూడి మండలం బలరామపురం తదితర గ్రామాల్లో గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని అన్నదానాలు చేశారు. రౌతులపూడిలో సత్యదేవ కాలనీవాసుల ఆధ్వర్యంలో, బలరామపురంలో కొత్త రామాలయం వద్ద యువత ఆధ్వర్యంలో అన్నదానాలు జరిగాయి.

హుస్సేన్పురంలో టిడిపి రిలే దీక్షలు పాదయాత్ర

సామర్లకోట రూరల్ : చంద్రబాబుకు మద్దతుగా సామర్లకోట మండలం హుస్సేన్పురంలో గురువారం టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్షలు చేశారురు. అనంతరం గ్రామంలో పాదయాత్రను చేపట్టారు టిడిపి గ్రామ అధ్యక్షుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పాదయాత్రలో ఎంఎల్ఎ చిన రాజప్ప తమయుడు నిమ్మకాయల రంగనాగ్, నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, జి.రామకృష్ణ, తోటకూర శ్రీనివాస్, పాల్గొన్నారు.

దళిత లబ్ధిదారులకు భూములు అప్పగించాలి

ప్రజాశక్తి-తాళ్ళరేవు

దళితులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములను లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తాళ్ళరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ పటవల బూరుగు పుంత ప్రస్తుత పైడా కళాశాల వెనుక ప్రాంతంలో సర్వేనెంబర్ 486/4, 486/ 2 లో పంట కాలువ గట్టున పటవలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 30 సెంట్లు చొప్పున 1977లో దళితులకు భూమి కేటాయించిందన్నారు. ఆ భూముల్లో పైడా కళాశాల యాజమాన్యం అక్రమ కట్టడాలు నిర్మించి, మిగిలిన భూముల్లో చెత్త వేసి లబ్ధిదారులకు ఆటంకం కలిగిస్తోందని ఆ భూములను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని ప్రభుత్వానికి లబ్ధిదారులు ఫిర్యాదు చేశారన్నారు.

ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన అధికారులు ఈనెల 28న ఆధారాలతో రావాలని లబ్ధిదారులకు నోటీసులు పంపించింది అన్నారు. అయితే లబ్ధిదారులు తహశీల్దార్ కార్యాలయానికి రాగా కార్యాలయం తాళం వేసి ఉందని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ తెలిపారు. లబ్ధిదారులను ఆధారాలతో రమ్మన్న అధికారులు సెలవు రోజు పరిశీలించకుండానే తేదీ నిర్ణయించడం, లబ్ధిదారుల పట్ల అధికారుల అలసత్వం బయటపడిందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వారికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిలిచారు. కార్యక్రమంలో దళిత లబ్ధిదారులు, వారి వారసులు మురమళ్ళ శ్రీను, దడాల సత్యనారాయణ, వేలంగి సత్యనారాయణ, నేల సత్యనారాయణ, మురుగు సాయిబాబు, నాగాబత్తుల అప్పారావు మాట్లాడారు. పైడా కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని మా భూములను తిరిగి మాకు అప్పగించాలని లబ్ధిదారులు కోరారు.



తాళ్లరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత లబ్ధిదారులు

ఉత్సాహంగా గణపతి లడ్డూల వేలం

ప్రజాశక్తి-తాళ్లరేవు

గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా పలుచోట్ల లడ్డూల వేలం పాటలు గురువారం ఉత్సాహంగా సాగాయి. పి.మల్లవరంలో నిర్వహించిన లడ్డూ పాటలో హైటెక్ బ్యాచ్ సభ్యులు రూ.75 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. జి.వేమవరం మట్లపాలెం కాలనీ వినాయక మండపంలో ఏర్పాటు చేసిన 50 కిలోల లడ్డూను స్థానిక వైసిపి నాయకుడు దెయ్యాల సత్తిబాబు రూ.28,500 కు వేలంపాటలో దక్కించుకున్నారు. పాతకోరంగిలో వినాయక లడ్డూను చల్లా వెంకటేశ్వరరావు మనమడు అడబాల వీరబాబు రూ.13 వేలకు దక్కించుకున్నారు. పాతకోరంగి శెట్టిబలిజ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను యువజన సంఘం సభ్యులు రూ.9, 500కు పాడుకున్నారు.

పాతకోరంగిలో భారీ అన్నదానం

గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనాలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి పి.జగదీష్ తెలిపారు. రాజమహేంద్రవరం నగరంలోని పుష్కర ఘాట్ వద్ద పోలీసు బందోబస్తు, వినాయకుని నిమజ్జనం ఏర్పాట్లును గురువారం రాత్రి ఆయన ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కర ఘాట్ దగ్గరలో ఉన్న వినాయక నిమజ్జన ప్రదేశమైన ఇసుక ర్యాంపు వద్ద జరుగుచున్న నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినాయకుని ఊరేగింపుల సమయంలో రోడ్లమీద ఎటు వంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా, నిర్దిష్ట మార్గాలను కేటాయించి, రూట్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎటువంటి ప్రాణహాని జరగకుండా, గజ ఈతగాళ్లను పెట్టి, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు.

మత్స్యకార మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ

ప్రజాశక్తి-తాళ్లరేవు

మత్స్యకార మహిళలకు ఫిష్ వాల్యూ ఎడిషన్కి సంబంధించి వృత్తినైపుణ్యంపై శిక్షణ ఇచ్చారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో యుఎన్డి పి.జిసిఎఫ్ సౌజన్యంతో మండల పరిధిలోని 50 మందికి శిక్షణ కార్యక్రమాన్ని మత్స్యశాఖ ఎడి లావణ్య గురువారం ప్రారంభించారు. మూడు రోజులపాటు ఈ శిక్షణ జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్డిఒ జి.గోపి, గ్రామ మత్స్య సహాయకులు, సాగర మిత్రలు సిబ్బంది పాల్గొన్నారు.

కెసిబిఎస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

కెసిబిఎస్ శతాబ్ది ఉత్సవాల్లోభాగంగా ది కాకినాడ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పవర్ ట్రినిటీ హాస్పిటల్ సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆంకాలాజిస్ట్, డాక్టర్ అమృత, పల్మానాలజిస్టు డాక్టర్ ప్రియాంకదర్శిని పాల్గొని వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమానికి కెసిబిఎస్ అధ్యక్షులు కోసూరి సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షులు రెడ్డి వీర రాజేంద్ర కుమార్, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఓబిలశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కోసూరి లక్ష్మి ప్రసాద లావణ్య, ఇంచార్జి మేనేజర్ చీమలకొండ గంగాధరం ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా సంఘ సభ్యులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ప్రకృతి సాగుతో లాభాలు

జగ్గంపేట రూరల్ : ప్రకృతి సాగుతో లాభాలు పొందొచ్చని క్లస్టర్ అధికారి శ్రీదేవి అన్నారు. మండలంలోని గొల్లలగుంటలో ఎస్టుఎస్ విధానంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టామన్నారు. గురువారం గొల్లలగుంటలో కాకినాడ జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఆదేశాల మేరకు విఒలో కంపక్ట్ బ్లాక్ మోడల్లో కొంతమంది రైతులు కలిసి ఎస్ టు ఎస్ విధానంలో చేపట్టిన ప్రకృతి సాగును ఆమె పరిశీలించారు. యెల్లో ప్లేట్స్, పక్షి స్థావరాలు, లింగర్షక బట్టలు రైతులు తమ పొలాల్లో పెట్టారన్నారు. గట్లపై వంగ , మిర్చి , బంతి మొక్కలు వంటి పలు రకాల పంటలను వేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరరావు, మండల డిజిటల్ ఇంఛార్జి పడాల రాజేష్ , నాగేశ్వరావు, గౌరి, సత్యనారాయణ, కృష్ణవేణి, వీరరాఘవ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

కాకినాడ కార్పొరేషన్ : నగరంలో ముస్లిములు మిలాద్ ఉన్ నబీని గురువారం ఘనంగా నిర్వహించారు. రమణయ్యపేట మార్కెట్ సమీపంలో గల మస్జిద్-ఏ- ఖుబా నుంచి ముస్లిములు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్ ఇమామ్ జహంగీర్ మిలాద్ ఉన్ నబీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గౌస్, హుస్సేన్, రోషాన్, అలీషా, బాషా, ఖాజా, ఇస్మాయిల్, రియాజ్, మహ్మద్ పాల్గొన్నారు.